టెర్రర్ జంక్షన్లు!



పరీక్షల వేళ.. విద్యార్థుల ఆందోళన

ఇప్పుడు పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు వారి తల్లి దండ్రుల్లో ఆందోళన కలుగుతోంది. సమయానికి ముందే బయలుదేరినా ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కుంటే సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోలేమన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలలు, పాఠశాలలు పెరగడంతో రద్దీ

గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు పెరగడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థుల తాకిడి పెరిగింది. అంతే కాకుండా ఈ ప్రాంతంలో అద్దెకు ఉండేవారు, నివాసీయుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. దీంతో వాహనాలు భారీగా పెరిగాయి.



- గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో ప్రమాదకరంగా కూడళ్లు
- ఉదయం, సాయంత్రం వేళ తీవ్ర ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలతో సతమతం
- బాజీ జంక్షన్‌కు పెరిగిన రద్దీ
- పనిచేయని సిగ్నల్ లైట్లు



బాజీ జంక్షన్‌లో నిలిచిన వాహనాలు



బాజీ జంక్షన్‌లో గందరగోళంగా ట్రాఫిక్



గోపాలపట్నం బంక్ వద్ద మాన్యువల్‌గా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీస్

గోపాలపట్నం: ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వెళ్లే రహదారుల్లో జంక్షన్లు టెర్రర్ పెట్టిస్తున్నాయి. ఈ జంక్షన్లు దాటితే చాలు అన్నట్టుగా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని దాటుతున్నారు. అందులోనూ ఉదయం, సాయంత్రం సమయాల్లో మరింత దారుణంగా ఉంటోంది. గంటలకొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

తరచూ ప్రమాదాలతో...

జంక్షన్లలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చాలా మేరకు చిన్న చిన్న ప్రమాదాలతో తప్పించుకుంటున్నారు. జంక్షన్ దాటి వెళ్లాలంటే వాహన చోదకులు భయపడుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది పరుగులు తీస్తూ వాహనాలను నియంత్రిస్తున్నారు.

పని చేయని సిగ్నల్ లైట్లు

బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం సమయంలో సిగ్నల్ లైట్లు వేశారు. వీటిని పరిశీలించేందుకు పలు మార్లు వేశారు. ఆతర్వాత సిగ్నల్ లైట్లు మార్చారు. అంతే ఇంతవరకు వాటిని వినిమోగించిన పాపాన పోలేదు. గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో అలంకార ప్రాయంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఒకే దిశలో రెండు వైపులా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో పెందుర్తి, సింహాచలం వైపు వాహనాలను నియంత్రించడానికి పోలీసులు చుక్కలు చూస్తున్నారు. ఇక్కడ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. బాజీ జంక్షన్‌లో రద్దీ ఎక్కువగా ఉండడంతో అవస్థలు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి

పెరుగుతున్న రద్దీని అనుసరించి ప్రత్యామ్నాయాలపై అధికారులు, నాయకులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. లక్ష్మీనగర్, ఇందిరానగర్ మీదుగా వెళ్లే రహదారితో పాటు తాటిపూడి పైప్‌లైన్ రహదారిని అభివృద్ధి చేస్తే ప్రయాణికులకు వెసులుబాటుగా ఉంటుందని చెబుతున్నారు.

వీధి దీపాల ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీ, ఎస్సీకాలనీ, రాజీవ్‌కాలనీ, కాకరలోవ, బొబ్బిలివీధి తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది సోమవారం నూతన వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఈ పనులను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు వీధిదీపాల సమస్యలపై విన్నవించామని, దీంతో వార్డులోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మారక క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సౌత్ ఏసీపీ కాళిదాసు, నాయకులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్‌కాలనీలో సోమవారం అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ స్మారక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దళిత రత్న మాటూరి చిన్నారావు, సౌత్ ఏసీపీ ఎన్. కాళిదాసు కాలెండర్ ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దేవా గాంధీ, ముంజేటి హనుమంతరావు, ఉల్లి రమణ, సబ్బవరపు శ్రీనివాస్, తంతటి సంపత్‌కుమార్, ఈశ్వరరావు, మధు, నడుపూరు వెంకటరమణ, సిమ్మిటి శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామాజిక సేవలో సంతృప్తి



విద్యార్థులకు పరికరాలు అందిస్తున్న కీర్తిపట్నాయక్

మల్కాపురం: శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు 23వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకురాలు కీర్తిపట్నాయక్ స్థానిక బాలిక ఆశ్రమంలో విద్యార్థులకు అవసరమైన పరికరాలు,పౌష్టికాహారం, ఆశ్రమం శుభ్రపరుచుకునేందుకు అవసరమైన శానిటరీ పరికరాలను ఆమె అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవలో సంతృప్తి లభిస్తుందన్నారు.

స్టాక్ పాయింట్‌ల పరిశీలన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, కాకరలోవ, జయేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల స్టాక్ పాయింట్‌లను వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సోమవారం పరిశీలించారు. బాలింతలకు, పిల్లలకు ప్రతి నెలా మొదటి శుక్రవారం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కేంద్రంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

300 మంది భవానీ మాలధారణ



ఆర్పీపేట పుట్టబంగారం ఆలయంలో మాలధారణ చేస్తున్న భవానీ భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేటలో వెలసిన పైడిమాంబ అమ్మవారి వార్షిక మహోత్సవం, నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం భవానీ భక్తులు మాలధారణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయశర్మ నేతృత్వంలో పైడిమాంబ పుట్టబంగారం ఆలయంలో సుమారు 300 మందికి మాలధారణ చేశారు. ఆర్పీపేటలో గౌరీ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం, గవర కంచరపాలెంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అంబలం పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భవానీ భక్తులు, వార్డు ప్రజలు అంబలం పూజల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఏయూలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్య సంబంధిత క్రమశిక్షణను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యమిస్తామని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఇంజనీరింగ్, మహిళా ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సోమవారం ఉదయం ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఫార్మసీ, న్యాయ, ఆర్ట్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలో వసతుల కల్పన తదితర అంశాలకు సంబంధించిన వివరాలు, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విభాగాల్లో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని, విద్యార్థులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులందరూ నియమావళిని అనుసరించేలా ఆచార్యులు, విభాగాధిపతి చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం తరగతులకు వస్తేనే వారి నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని, భవిష్యత్తులో ఉన్నత, ఉపాధి అవకాశాలను పొందడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి విభాగంలోని సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగు పరచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం చేస్తామన్నారు. త్వరలో జరగనున్న శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు జి.శోభాభూషణరావు, జి.గిరిజా శంకర్, ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వైపు.. విద్యార్థుల చూపు

- గోపాలపట్నం హైస్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు
- క్విజ్, పోస్టర్ల ప్రదర్శన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గోపాలపట్నం హైస్కూల్ వద్ద సైన్స్ డే కార్యక్రమానికి స్వాగతం పలుకుతున్న చిత్రం



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వీటిని ఏపీసీ ఎస్ఎస్ఏ డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను మెరుగు పరిచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు వారి ఆలోచనా సరళిని మార్చుకుని.. విజ్ఞానం, సృజనాత్మకత వైపు నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య సందేహాలు నివృత్తి చేసుకునేలా స్వేచ్ఛ ఉండాలన్నారు. గ్లోబల్ లీడర్స్‌గా భారత యువత అనే అంశంపై విద్యార్థులు తయారు చేసిన పోస్టర్లు ఆలోచింపజేశాయని తెలిపారు.

పోటీల్లో 25 పాఠశాలల విద్యార్థులు

సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్, పోస్టర్ ప్రదర్శన పోటీల్లో జిల్లాలోని 25 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాలుగా పోటీలు జరిగాయి.

- క్విజ్ సీనియర్ విభాగంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, యల్లపువానిపాలెం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం పొందారు.
- పోస్టర్ల ప్రదర్శన సీనియర్ విభాగంలో ఎం.జోష్, మొదటి స్థానం, మధుప్రియ ద్వితీయ, భానుప్రకాష్ తృతీయ స్థానం దక్కించుకున్నారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- క్విజ్ జూనియర్ విభాగంలో బాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మొదటి స్థానం, ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ రెండో స్థానం సాధించాయి.
- పోస్టర్ల ప్రదర్శన జూనియర్ విభాగంలో సిహెచ్.మోహన్ మొదటి స్థానం, అక్షయ అభివర్మ రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు డాక్టర్ చంద్రశేఖర్ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త ఎస్.బాబూరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరించండి మహాప్రభో..



కాకరలోవ కొండవాలు ప్రాంతంలో విస్తరణకు నోచుకోని రోడ్డు


సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో కొండవాలు ప్రాంతమైన పాత వాటర్ ట్యాంక్ దగ్గర ఉన్న రోడ్డు మలుపు వద్ద ఇరువైపులా విస్తరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు విస్తరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొండవాలు ప్రాంతం కావడం, మలుపు వద్ద కేవలం 10 అడుగుల రోడ్డు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 100 కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో అత్యవసర సమయంలో ఆసుపత్రికి పోవాలన్నా ద్విచక్రవాహనాలే గతి. అంబులెన్సు వచ్చే సదుపాయం కూడా లేదు. రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వం స్థలం ఉన్నందును విస్తరించి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తరలింపునకు సన్నాహాలు

పిలకవానిపాలెం వాసులు వ్యతిరేకించడంతో వెనుదిరిగిన అధికారులు



పిలకవానిపాలెం గ్రామస్తులతో సమావేశమైన ములగాడ విద్యా శాఖాధికారులు



పిలకవానిపాలెంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తరలించాలనుకున్న అధికారుల తీరును స్థానికులు పూర్తిగా వ్యతిరేకించారు. దీంతో చేసేదేం లేక అధికారులు మౌనంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పిలకవానిపాలెంలో సుమారు 15 ఏళ్లుగా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఈ పాఠశాలలో పలు వసతులను కల్పించి అందంగా ముస్తాబు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇక్కడి విద్యార్థులను ఇదే వార్డులోని ములగాడ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు తరలించే ఆలోచన చేశారు. దీనిలో భాగంగా ములగాడ మండల విద్యాశాఖాధికారులు సోమవారం పిలకవానిపాలెం గ్రామస్తులతో సమావేశమయ్యారు. విద్యార్థుల తరలింపుపై వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీనిని గ్రామస్తులంతా ఐక్యతతో పూర్తిగా వ్యతిరేకించడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో వారిని ములగాడ స్కూల్‌కు తరలించి ఆలోచనలో అధికారులు ఉన్నారని పిలకవానిపాలెం అన్నారు. గత ప్రభుత్వంలో ఈ పాఠశాలను లక్షల రూపాయలతో అభివృద్ధి చేశారని, వీలైతే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే ఆలోచన చేయాలే గానీ.. విద్యార్థులను తరలించడం ఏంటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ తొలి రోజు పరీక్షలు



పరీక్ష కేంద్రం వేచి ఉన్న విద్యార్థులు



పరీక్ష అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

మల్కాపురం: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా సాగాయి. జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల ఆండాలమ్మ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందే విద్యార్థులు చేసుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి తదితరులు

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ ఎదుట శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి ముఖ్య అతిథిగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా ఎదగాలన్నారు. ఇందుకు అవసరమైన విజ్ఞానం, మానసిక స్థైర్యాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ దిశగా మహిళల్లో చైతన్యం తేవాలనే లక్ష్యంతో జిల్లాలోని అనేక శాఖలకు చెందిన మహిళలతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. సెక్టార్-9 సంక్షేమ భవన్ నుంచి ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఏఎస్ రాజా కూడలి వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, పలు శాఖల డీడీలు, పీడీలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి


భర్తకు రిమాండ్

మల్కాపురం: భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేశాడు. ఘటనకు కారకుడైన భర్తను మల్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. 63వ వార్డు దుర్గానగర్ ప్రాంతంలో పరపతి మురళి అనే వ్యక్తి భార్య సరస్వతి, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. మురళి సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే మనస్పర్థల కారణంగా మురళికి దూరంగా భార్య సరస్వతి కుమార్తెతో కలిసి ఏడాది నుంచి అద్దె ఇంట్లో ఉంటుంది. గాజువాకలోని ఓ షాపింగ్‌మాల్‌లో సెక్యూరిటీగా పని చేస్తుంది. కాగా ఇటీవల సరస్వతి వేరే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్లడం చూసిన మురళి ఆగ్రహానికి గురయ్యాడు. ఆమెపై ఎలా అయినా దాడి చేయాలని భావించి ఆదివారం రాత్రి దుర్గానగర్ వద్ద మాటు వేశాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న సరస్వతిని చూసిన మురళి ఆమె ఉంటున్న ఇంటి ముందు కత్తితో మెడపై దాడి చేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో మురళి అక్కడ నుంచి పరుగు తీశాడు. చుట్టు పక్కల వారు సరస్వతిని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో వారు ఘటనా స్థలానికి వచ్చి దాడిపై ఆరా తీశారు. దాడి చేసిన మురళి సోమవారం ఉదయం దుర్గానగర్ వద్ద సంచరిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లో జాతీయ సదస్సు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా ఏప్రిల్ 3,4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'ఆర్థిక సమ్మిళత–సామాజిక సమానత్వం : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ఒక రోడ్ మ్యాప్' అనే అంశంపై సదస్సు జరగనుంది. సదస్సు నిర్వాహకులను ఈ సందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, సదస్సు సహ కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బారావు పాల్గొన్నారు.

భూ సేకరణ చట్టంపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.ఆర్.ఎన్.శర్మ

విశాఖ విద్య: ఏయూ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా 'భూ సేకరణ చట్టం–సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ న్యూఢిల్లీకి చెందిన మాజీ ప్రొఫెసర్ కె.ఎస్.ఆర్.ఎన్.శర్మ ముఖ్య ప్రసంగం చేస్తూ భూసేకరణ చట్టం అనేది ప్రభుత్వం లేదా ప్రభుత్వ–ఆమోదిత సంస్థలు ప్రజల భూములను సేకరించడానికి ఉపయోగించే చట్టపరమైన ప్రక్రియ న్నారు. ఈ చట్టం ప్రజల భూములను సేకరించడానికి అనుమతిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథి రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు, ఆచార్య ప్రేమానందం, విద్యార్థులు, స్కాలర్స్ పాల్గొన్నారు.